రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:30 (గురువారం సాయంత్రం) సహర్ 4:55 (శుక్రవారం ఉదయం)

సెస్ అధికారుల దాడులు

సిరిసిల్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల సెస్ పరిధిలోని చిరువ్యాపారులపై బకాయిలను చెల్లించాలంటూ సెస్ అధికారులు బుధవారం దాడులు చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాల్లో విద్యుత్ బకాయిలు వేలల్లో ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలంటూ సెస్ డీఈఈ ఆధ్వర్యంలో బృందం కనెక్షన్లను నిలిపివేసి చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేశారు. విద్యుత్ బిల్లులను చెల్లిస్తామని వ్యాపారులు చెప్పినా డీఈఈ ఇష్టానుసారంగా మాట్లాడడంతో పాటు దురుసుగా ప్రవర్తించినట్లు వ్యాపారులు ఆరోపించారు.

నేడు వేలం పాట

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మేజర్‌గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం తైబజార్,జీపీకి సంబంధించిన వ్యాపార దుకాణాలకు వేలం పాటలు నిర్వహించనున్నామని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, దుకాణాలకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 వేలు, రూ.2వేలు ముందస్తు చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామ సభలో వేలంపాటలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కోరారు.

మడేలేశ్వర స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు

వేములవాడ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాన గ్రామంలో మడేలేశ్వరస్వామిని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ మ్యాక రవి, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, మాజీ వైస్ఎంపీపీ ఆర్‌సీరావు, బూర బాబు, ఏర్ల మురళి, లింగంపల్లి రాజయ్య, లింగారావు, అభిమన్యు, ముత్త మహేష్, ప్రమోద్, రజక సంఘం సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

యాంత్రీకరణపై ఆశలు..



- రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు
- కేంద్రం నిధులు వెనక్కి వెళ్లకుండా వేగంగా కసరత్తు
- జిల్లాలో మొదలుకాని ప్రక్రియ
- 198 యూనిట్లు.. రూ.58.84 లక్షలు మంజూరు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ రైతుల్లో ఆశలు కల్పించింది. గతంలో అమల్లో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2016-17 అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. మళ్లీ ఈ పథకాన్ని 2024-25ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు అడుగులు వేసింది. కేంద్రం నిధులు వెనక్కి వెళ్లకుండా వేగవంతంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు 198యూనిట్లకు రూ.58.84 లక్షలు మంజూరు చేశారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో యాంత్రీకరణపై దరఖాస్తుల ఆహ్వానం, ఇతర ప్రక్రియ మొదలైనా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదలు పెట్టలేదని తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే వ్యవసాయ యాంత్రీకరణలో రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన కింద కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి31తో ముగుస్తుంది. 31దాటిన తరువాత కేంద్రం నిధులు వెనక్కి వెళతాయి. దీంతో ఈనెల చివరివరకు దరఖాస్తులు స్వీకరించి పనిముట్లు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశాలు కూడా అందాయి.

మహిళా రైతులకే పనిముట్లు..

వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు పనిముట్లు అందించడానికి నిర్ణయించారు. 13రకాల యాంత్రీకరణ పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. 50శాతం రాయితీతో మహిళా రైతులకు మాత్రమే యంత్రాలు, పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లోని మం డలాల్లో ప్రణాళికలు కూడా రూపొందించారు. యాంత్రీకరణలో ట్రాక్టర్ రూ.5 లక్షలు, రోటోవేటర్ రూ.1.44 లక్షలు, పవర్ టిల్లర్ రూ.లక్ష, స్ట్రాబేలర్స్ రూ.లక్ష, మేయిజ్ షెల్లర్ రూ.లక్ష, కల్టీవేటర్, ప్లవ్, కేజీవీల్, రోటో పడ్లర్ రూ.75906, పవర్ స్ప్రేయర్ రూ.45 వేలు, బ్రష్ కట్టర్ రూ.35 వేలు, పవర్ వీటర్ రూ.35 వేలు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ రూ.30వేలు, బండ్ ఫార్మర్ రూ.13 వేలు, బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్ రూ.5 వేలు, తదితర రకాలను 50 శాతంతో అందించనున్నారు.

రైతుల్లో హర్షం...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్‌లలో 4.14లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. వానా కాలం సీజన్‌లో 2,40,503 ఎకరాలు, యాసంగిలో 1,74,101 ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేస్తారు. వ్యవసాయ కూలీల కొరతతో ప్రతి సీజన్‌లోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై యంత్రాలు ఇవ్వడం ద్వారా ఇబ్బందులు తొలగుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు ప్రభుత్వం 12 మండలాలు, రెండు మున్సిపాలిటీలలోని రైతులకు 198 యూనిట్లు, రూ.58.84 లక్షలను మంజూరు చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల ...

మిగతా 8లో

రాజన్న సన్నిధిలో బీసీ కమిషన్ చైర్మన్ పూజలు



బీసీ కమిషన్ చైర్మన్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రాజన్న శేషవస్త్రాలతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన విజయవంతంగా పూర్తి చేసుకుని అసెంబ్లీలో తీర్మానం పొందిందని, అమలు కూడా సక్రమంగా జరగాలనే ఉద్దేశ్యంతోనే రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీసీ వర్గానికి చెందిన కొన్ని కులాలకు చెందిన పేర్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నామని, బీసీ కమిషన్‌కు వచ్చిన విజ్ఞప్తుల మేరకు తుది నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు తీసుకోవాలని వచ్చామన్నారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, బీసీ సంక్షమ అధికారి రాజ మనోహర్‌రావు తదితరులు ఉన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. తంగళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని, మైనార్టీ పాఠశాలలోని పరీక్షా కేంద్రాలలో పరీక్ష సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● ఇల్లంతకుంట : మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల కేంద్రాలను జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల, ఇల్లంతకుంటలోని కేరళ మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలను పరిశీలించి పలు జాగ్రత్తలు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

మంత్రివర్గ విస్తరణపై ఆశలు

- ఆది శ్రీనివాస్‌కు పదవి ఖాయమంటూ కాంగ్రెస్ కార్యకర్తల ప్రచారం

వేములవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం లభిస్తుందంటూ ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉగాది పండుగ రోజున లేదా ఏప్రిల్ మూడో తేదీన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టడం ఖాయమని భావిస్తున్న తరుణంలో బీసీ వర్గానికి చెందిన మున్నూరు కాపు నాయకుడు ఆది శ్రీనివాస్‌కు రాష్ట్ర కేబినెట్లో బెర్త్ ఖాయమని ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆది శ్రీనివాస్‌కు మంత్రివర్గ విస్తరణ సందర్భంగా కేబినెట్‌లో స్థానం కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన మద్దతుదారులు అంటున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను కలిసి మంత్రివర్గ కూర్పుపై చర్చించి, కొత్త మంత్రుల పేర్లతో కూడిన తుది జాబితాను సిద్ధం చేశారని, ఈ జాబితాలో తమ నాయకుడి పేరున్నదని వారు చెప్పుకుంటున్నారు. ఈమేరకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో అవకాశం లభించనున్న ఎమ్మెల్యేల పేర్లు, వారికి కేటాయించనున్న శాఖల వివరాలతో సహా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. తమ నాయకుడు ఆది శ్రీనివాస్‌కు 2023 సంవత్సరంలోనే మంత్రి వర్గంలో స్థానం లభించాల్సి ఉందని, వివిధ రకాల సమీకరణాల నేపథ్యంలో అప్పుడు అవకాశం లభించని కారణంగా ప్రభుత్వ విప్‌గా అవకాశం ఇచ్చారని పేర్కొంటున్నారు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో తప్పనిసరిగా చోటు లభిస్తుందని వారు ధీమాతో ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో ముందుండాలి



అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి వేములవాడకు వెళుతున్న ఆయన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, పదిర గ్రామాల్లోని ఆ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మద్దుల పద్మారెడ్డిల ఇళ్లకు బుధవారం చేరుకున్నారు. నాయకులు, కార్యకర్తలతో ఈ ప్రాంత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉండేలా చూడాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా వివరించాలని పేర్కొన్నారు. నాయకులు హరిభూషన్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



జమునకు పార్టీ కండువా కప్పుతున్న అన్నపూర్ణ

సిరిసిల్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీషల ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలానికి చెందిన ఎక్కలదేవి జమున బీజేపీ పార్టీలో చేరగా, జిల్లా అధ్యక్షుడు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డుస్థాయి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవుల కు బీజేపీ అభ్యర్థులు బరిలో ఉంటారని వారిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎక్కలదేవి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని ప్యాక్స్ వైస్‌చైర్మన్ కృష్ణమూర్తి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో బుధవారం మహా జనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్నదాతలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సహకారం సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. గతంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోళ్లను యథావిధిగా చేపట్టేలా చూడాలన్నారు. రూ.1.50 కోట్ల దీర్ఘకాలిక, రూ.5 కోట్ల స్వల్పకాలిక రుణాలను అందించామని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్లు సత్తిరెడ్డి, నారాయణ, లక్ష్మణ్, నరహరి, ఏఎంసీ డైరెక్టర్ నారాయణరెడ్డి, సంఘం కార్యదర్శి శశివర్ధన్‌గౌడ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘ పాలకవర్గాన్ని కొనసాగించాలని ఉత్తర్వులు



జిల్లా సహకార అధికారికి కోర్టు ఉత్తర్వులు అందిస్తున్న తిరుపతిరెడ్డి

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెండు సహకార సంఘాల పాలకవర్గాలను కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సహకార సంఘాల పాలక వర్గాల గడువు తీరడంతో ప్రభుత్వం ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాల పాలకవర్గాల స్థానంలో పర్సన్ ఇంచార్జీలను నియమించింది. రాష్ట్రంలోని కొన్ని సహకార సంఘాల పాలకవర్గాలను కొనసాగిస్తూ తమను తొలగించడంపై పాలకవర్గాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం కోర్టును ఆశ్రయించిన పాలకవర్గాన్ని కొనసాగించాలని ఆదేశాలు జారీచేసింది. బుధవారం ఇల్లంతకుంట సహకార సంఘ మాజీ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి జిల్లా సహకార అధికారి రామకృష్ణను కలిసి కోర్టు ఉత్తర్వులు అందించారు. ఇల్లంతకుంట సహకార సంఘ పరిధిలో మాజీ అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు గొడుగు తిరుపతి, మాజీ డైరెక్టర్లు కట్ట సుధాకర్‌రెడ్డి, నాయిని నవీన్‌కుమార్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, చల్ల నవీన్‌కుమార్, గన్నారం వసంత, పల్లె సృజన్‌రెడ్డి, గజ్జల సత్తయ్యలు కొనసాగాలని ఆదేశించారు. గాలిపెల్లి సహకార సంఘ పరిధిలో మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డైరెక్టర్లు రవి, రాంరెడ్డి, మనోహర్ రెడ్డి, నారాయణరెడ్డి, దుర్గయ్య, శాంత, వెంకటరాంరెడ్డి, లచ్చవ్వ, శ్రీనివాస్‌లకు అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి. ఇల్లంతకుంట సహకార సంఘ పరిధిలో ముగ్గురు డైరెక్టర్లు న్యాయస్థానానికి వెళ్లపోవడంపై చర్చ కొనసాగుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవల విస్తరణ

- నికర లాభం రూ.3.58 కోట్లు - సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ లక్ష్మీనారాయణ

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ సేవలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అందించే విధంగా విస్తరించాలని తీర్మానించారు. 2025-2026 బ్యాంక్ అంచనా బడ్జెట్ రూ 14 కోట్లకు ఆమోదించారు. బుధవారం సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ అర్థవార్షిక సంవత్సరపు మహాసభ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. బ్యాంక్‌కు నూతనంగా ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిపై తీసుకోవడం, బ్యాంక్‌లో సైబర్‌సెక్యూరిటీ చర్యలు వంటివి తీసుకునే విధంగా చర్చించారు. చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సభ్యులకు 12 శాతం డివిడెండ్ కింద వారిఖాతాల్లో రూ 21.42 లక్షలు జమ చేశామని తెలిపారు. బ్యాంక్‌లో డిపాజిట్లు రూ 10109.06 లక్షలకు చేరుకుందని తెలిపారు. బ్యాంక్ నుంచి రూ.7888.49లక్షలకు రుణాలు పెరిగాయని తెలిపారు. బ్యాంక్ నికరలాభం రూ.3.58 కోట్లకు చేరుకుందన్నారు. సభ్యులు రాగుల జగన్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలు పట్టణ ప్రజలకు మరింత విస్తరించాలని కోరారు. సభ్యులు ఎర్రం వెంకట్రాజం, దొంత దేవదాస్‌లు మాట్లాడుతూ సభ్యులకు డివిడెండ్ పెంచాలని, అప్పులపై వడ్డీ తగ్గించాలని కోరారు. బియ్యంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ బకాయిదారుల జాబితాను వార్షిక నివేదికలో ముద్రించాలని శ్రేయోనిధిని పెంచాలని కోరారు. గుండ్లపల్లి శ్రీనివాస్, కోడం అశోక్‌లు మాట్లాడుతూ ఏటీఎంలు విస్తరించాలని అన్నారు. రాజమౌళి మాట్లాడుతూ సభ్యులకు డివిడెండ్‌ను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ సిరిసిల్ల ప్రజలందరూ బ్యాంక్‌లో ఖాతాలు పొంది వ్యాపార కార్యాకలాపాలను నిర్వహించుకోవాలన్నారు. మాజీ చైర్మన్ గాజుల బాలయ్య మాట్లాడుతూ బ్యాంక్ డిపాజిట్లు రూ.వంద కోట్లు దాటిందని ఇది బ్యాంక్ పెరుగుదలకు శుభసూచకమన్నారు. మాజీ చైర్మన్లు దార్నం లక్ష్మీనారాయణ, గాజుల నారాయణ, గడ్డం విఠల్‌లు మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలన్నారు. వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానం దం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల చుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేష్, కోడం సంజీవ్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి, బ్యాంక్ సీఈవో పత్తిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాడలేని సెంట్రల్ లైటింగ్

- రాత్రి సమయాల్లో ప్రమాదాలు 6



సెంట్రల్ లైటింగ్ లేని నందికమాన్-కలెక్టరేట్ రోడ్డు

రాజన్న హుండీ ఆదాయం రూ.కోటి 95 లక్షలు 7



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందికి అవగహన, శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి రాష్ట్రప్రభుత్వం అందించే మద్దతు ధరలను పొందాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో 172 కొనుగోలు కేంద్రాలతోపాటు సింగిల్ విండోల ఆధ్వర్యంలో 57, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 6, మెప్మా ఆధ్వర్యంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుందన్నారు. ఈ సీజన్‌లో కొత్తగా 128సెంటర్‌లను ఐకేపీకి కేటాయించిందన్నారు. ఈ యసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను నిర్ణయించిందని, గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2320 చెల్లిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు అందుబాటులో ఉండేలా అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మి, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మృతిని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తండ్రి మరణించడంతో తట్టుకోలేక మానసిక క్షోభతో అతని కుమారుడు గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన అచంట శివశంకర్(42) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివశంకర్ ఎన్‌టీపీసీలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి 20రోజుల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆందోళనకు గురయ్యాడని, బుధవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దిగబెట్టిన శివశంకర్ ఇంటికి వచ్చాడని, అప్పటికే భార్య టైలరింగ్ చేసేందుకు బయటికి వెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లహరి అలియాస్ వెంగమాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం


నవీన్ (ఫైల్)

ధర్మారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్యహత్య చేసుకున్న ఘటన కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెరువట్ల నవీన్ (29) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నవీన్ ప్రవర్తనతో విసుగు చెందిన అతని భార్య పిల్లలు ఇల్లు వదిలివెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిచంగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శీలం నరేష్ తెలిపారు.

పాఠాలు చెబుతూ కుప్పకూలిన టీచర్

● ఆసుపత్రిలో మృతి


అనురాధ(ఫైల్)

మల్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న బోగ అనురాధ(43) అనే ఉపాధ్యాయురాలు బుధవారం గుండె పోటుతో కుప్పకూలి మృతి చెందింది. అనురాధ భోజన విరామం అనంతరం విద్యార్థులకు పాఠాలు చెబుతుండగానే గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేక గుండెపోటుతో మృతిచెందింది. ఉపాధ్యాయురాలి మృతితో పాఠశాలలో విషాదం నెలకొంది.

రిజర్వాయర్‌లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాముని‌పల్లె రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి చెరువులో మంగళవారం గల్లంతైన బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతదేహం బుధవారం లభ్యమైంది. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి మంగళవారం రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసికుటుంబ సభ్యులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రంగదాముడిపల్లె రిజర్వాయర్‌లోకి గజఈతగాళ్లను దింపి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జగిత్యాల జిల్లాప్రధానాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాడలేని సెంట్రల్ లైటింగ్

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● రాత్రి సమయాల్లో ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

వేములవాడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక వాహనదారుల సౌకర్యార్థం నాలుగు వరసల రోడ్డును ఏర్పాటుచేసినా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం జంక్షన్ నుంచి వేములవాడకు వచ్చే నందికమాన్ వరకు నాలుగు వరుసల రోడ్డు వేసి మధ్యలో పూలమొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దారు. అయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకోవడంతో రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, భక్తులు వాపోతున్నారు.


సెంట్రల్ లైటింగ్ లేకుండా ఉన్న నందికమాన్-కలెక్టరేట్ రోడ్డు

తప్పని ఇబ్బందులు..

జిల్లా కేంద్రం నుంచి వేములవాడకు వచ్చే వాహనాలు లైటింగ్ లేకపోవడంతో వాహనాదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు హైదరాబాద్ నుంచి సిరిసిల్ల మీదుగా రాజన్న దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో వాహనాల్లో ఆలయానికి వస్తున్నారు. అయితే రాత్రి సమయంలో వచ్చే భక్తులు లైటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నందికమాన్, గుర్రంవానిపల్లి, అగ్రహారం, చంద్రగిరి గ్రామాలకు చెందిన స్థానికులు రాత్రి సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్ నుంచి నందికమాన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నందికమాన్ నుంచి కొడుముంజ గ్రామం వరకు నాలుగు వరుసల రోడ్డు పూర్తి అయినా మధ్యలో పూల మొక్కలు నాటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందులు.. నాగుల రాము, సంకెపల్లి



నందికమాన్ నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుర్రంవానిపల్లి సమీపంలో పాదచారులు నడుచుకుంటూ రోడ్డు దాటితే కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

లైటింగ్ ఏర్పాటు చేయాలి..: నేరేళ్ల కిరణ్, తిప్పాపూర్



రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి లైటింగ్ ఏర్పాటు చేసి స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కట్నం కోసం వేధించిన భర్త, అత్తమామలపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన సంఘటనలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన పోతుల రాజిరెడ్డితో పాటు అతని తల్లిదండ్రులు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శిరీషకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన రాజిరెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైందన్నారు. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.2 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చి పెళ్లి జరిపించారని చెప్పారు. కొంతకాలం తర్వాత భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలు పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శిరీషను వేధింపులకు గురి చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు. సీఐతెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లపట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంకారపు ప్రభాకర్ ఇంటికి ఉన్న టులెట్ బోర్డును 4 జూన్ 2017న పాత పగలు దృష్టిలో పెట్టుకొని ఇంటి పక్కన ఉన్న కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అనేముగ్గురు తొలగించారు. దీంతో దూర్భాషలాడుతూ ప్రభాకర్ కర్రతో దాడి చేశాడని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అప్పటిసిరిసిల్ల ఏఎస్ఐ అనంతరెడ్డి అంకారపు ప్రభాకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ పదిమంది సాక్షు లను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా, కేసుపూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ నేరంరుజువు కావడంతో నిందితుడైన అంకారపు ప్రభాకర్‌కు ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండువాహనాలను వేర్వేరుప్రదేశాల్లో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. వెంకట్రావుపల్లె గ్రామంలోని కెనాల్ సమీపంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని నిందితుడైన మల్కినగేష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలోని కందికట్కూర్ గ్రామసమీపంలో ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కందికట్కూర్ గ్రామానికి చెందిన దొమ్మాటి అజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈవోకు గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఈవో అనూషకు గాయాలయ్యాయి. కట్కూర్‌ఏఈవో అనూష విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా తంగళ్లపెల్లి మండలకేంద్రంలో కారుఢీకొని స్వల్పంగా గాయాలయ్యాయి.

ఖర్చుల కోసం చోరీలు

● మహిళ నుంచి బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఖర్చుల కోసం ఓ మహిళ చోరీ మార్గాన్ని ఎంచుకుంది. భర్త ఎనిమిదేళ్ల క్రితం మరణించడంతో కొన్నాళ్లపాటు హోటల్‌లో పనిచేసి తన ఇద్దరు కూతుళ్ల వివాహంచేసింది. అప్పులు తీర్చలేక, ఇంటి అవసరాలు వెళ్లదీయలేక దొంగగా మారింది. ఓబంగారం షాపులో చోరీకి పాల్పడి 24గంటల్లో పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది. ఈఘటనకు సంబంధించి డీసీపీ పీ కరుణాకర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన లోకిని తిరుమల సోమవారం పట్టణంలోని దేవరకొండ కరుణాకర్ బంగారు ఆభరణాల షాపులో దొంగతనానికి పథకం వేసింది. వెంట సుత్తి, స్క్రూడ్రైవర్ తీసుకువెళ్లి షెట్టర్ తాళం పగుగొట్టి తెరిచింది. కౌంటర్లకు తాళం వేసి ఉండగా స్క్రూ డ్రైవర్‌తో తెరిచి 100గ్రాముల బంగారం, 40వేల రూపాయల నగదు దోచుకెళ్లింది. యజమాని కరుణాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు మల్లేష్, సిబ్బందితో ఓబృందంగా ఏర్పడి క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్స్ సీసీ పుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే తిరుమలను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం ఒప్పుకుంది. ఆమెనుంచి 100గ్రాముల బంగారం నగదు 28వేలరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ టాస్క్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు. వ్యాపారులు, ఇంటియజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, రాజు, రమేష్ ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి

సైదాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల కనకయ్య (54)అనేగీతకార్మికుడు వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారీకిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

వివాదాస్పదమైన ఎస్సెస్సీ ఇన్విజిలేషన్

● కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి విధులు

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోరుట్లలోని గౌతమ్ మోడల్‌స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేషన్ వివాదస్పదంగా మారింది. కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి ఇన్విజిలేటర్ నిర్వహించడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో ఓ పదో తరగతి విద్యార్థినికి పరీక్ష కేంద్రం కేటాయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కోరుట్ల పట్టణంలో పనిచేస్తున్నారు. వారికి కూతురు పరీక్షరాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా విధులునిర్వహించడానికి ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21నతెలుగు పరీక్షకు ఎక్కువమంది సిబ్బందిని విధులకు కేటాయించడంతో విద్యార్థిని తల్లికి విధులు కేటాయించలేదు. తండ్రిమాత్రం ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించాడు. ఇంగ్లీష్ పరీక్షరోజు కూడా ఆయన విధులకు హాజరయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలు పరీక్ష రాసే కేంద్రాల్లో తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు ఎవరు ఉన్నా ఇన్విజిలేషన్‌కు అనుమతించరు. ఇందుకుగాను ఉపాధ్యాయులు ముందే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉపాధ్యాయులు తమ కూతురు పరీక్ష రాసే విషయం తెలపకపోవడంతో వారికి విధులు కేటాయించారు. ఈ విషయం ఆలస్యంగా ఈనెల 24న బయటపడినట్లు సమాచారం. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తోటి ఇన్విజిలేటర్లు ఈ విషయం మండల విద్యాధికారికి నరేశంకు తెలవడంతో వెంటనే సెంటర్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సదరు ఇన్విజిలేటర్ నుంచి ఎంఈవో డిక్లరేషన్ తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించారు.

● ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ

కోరుట్ల రూరల్: ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేషన్ వివాదస్పదంపై సదరు ఉపాధ్యాయుడికి బుధవారం జిల్లా విద్యాధికారి రాము షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు మండల విద్యాధికారి నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో తన కూతురు పరీక్ష రాస్తున్న విషయంలో జరుగుతున్న వివాదంపై జిల్లా విద్యాధికారి కార్యాలయానికి వచ్చి గురువారం వివరణ ఇవ్వాలని ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు ఎంఈవో తెలిపారు.

అన్నారంలో దొంగల బీభత్సం

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాలు చోరీ
● ఒక ఇంటిలో బైక్ అపహరణ ● రంగంలోకి దిగిన క్లూస్ టీం..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో దొంగలు పడి నగదు, వెండి, బంగారు ఆభరణాలు, బైక్‌ను దొంగిలించారు. ఒక కుటుంబం వారు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లారు. మరొక కుటుంబం వారు తన తమ్ముడి ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. మరో ఇంటిలో పడుకున్న మహిళ పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. రుద్రోజు వెంకటాచారి ఇంటిలో ముప్పావు తులం బంగారం, 18తులాల వెండి పట్టీలు, మధునాల వెంకటమ్మ ఇంటిలో 55తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. పాకాల రాజిరెడ్డి ఇంటి ఆవరణలో పెట్టిన బైక్ ఎత్తుకెళ్లారు. గొట్టిముక్కల విజయ పుస్తెల తాడును తెంపే క్రమంలో మేల్కొన్న మహిళ అరుస్తూ దొంగ వెంబడి పరుగెత్తింది. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనానికి గురైన ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కరీంనగర్ క్లూస్‌టీం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

విద్యుత్ మోటారు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు సమీపంలోని రైతులు చల్ల కిష్టారెడ్డితో పాటు మరో రైతుకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ మోటారు తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించుకుపోయారు. సుమారు రూ.5వేల విలువ ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. చోరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కొత్తపల్లి మండలం లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా మద్యం పట్టుకు న్నారు. కొత్తపల్లి మండలం ఎలగందల్, బావుపేటలో నాలుగు బెల్ట్‌షాపులను సీజ్ చేశారు. రూ.26వేల విలువైన 40,735 లీటర్ల మద్యం పట్టుకున్నారు. నిర్వాహకులు రెడ్డివేని మనోహర్, దండు శంకరయ్య, గాలి రాజేష్, బోనాల దశరథంను అరెస్టు చేశారు.


పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్

మిర్చి యార్డులో దొంగతనం

● రూ.80వేలు చోరీ

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై ఉన్న తిమ్మాపూర్ ఎండుమిర్చియార్డులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి కౌంటర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మిర్చి యార్డు నిర్వాహకుడు మడికంటి శ్రీనివాస్, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ రోజులాగే మంగళవారం కూడా యార్డులో పనులు ముగించుకొని కరీంనగర్‌లోని ఇంటికివెళ్లాడు. బుధవారం ఉదయం ఉదయం తిరిగి యార్డుకు వచ్చిన క్రమంలో కౌంటర్ పగుల గొట్టి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వివేక్‌తోపాటు క్లూస్‌టీం పోలీసులు మిర్చియార్డుకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యార్డులోఉన్న సీసీ ఫుటేజ్ పరిశీలించగా అందులో ఇద్దరు దొంగలు వచ్చి డబ్బులు దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు. రాత్రి మిర్చిలోడ్‌వస్తుందని శ్రీనివాస్ రూ.80వేలు కౌంటర్‌లో పెట్టి వెళ్లాడు. మిర్చిలోడ్ రాకపోవడంతో డబ్బులు అందులోనే ఉండిపోయాయి. వాటినే దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.


యార్డులో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం

రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణరాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన రత్నాపూర్ కృషి విజ్ఞానకేంద్ర 13వ శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రంలో సాగుతున్న పండ్ల తోటలు, కూరగాయల సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు గత సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, వచ్చే సంవత్సరం చేపట్టబోయే కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. వ్యవసాయపంటల సాగుతో పోల్చుకుంటే ఉద్యానపంటలు పండ్లు,కూరగాయలు, పూలసాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని విజయ పేర్కొన్నారు. వాటికి అవసరమయ్యే శాస్త్ర,సాంకేతిక సహకారాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. సమావేశంలో విశ్వవిద్యాయలం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీధర్‌సిద్ధి, ఉషారాణి, వ్యవసాయసంయుక్త సంచాలకులు అంజనీదేవి, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, పిడి డిఆర్‌డిఏ కలిందిని జిల్లా పశుపోషణ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు విజయ

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు : సీఐ

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగం అనర్థదాయక మని, యువత వాటిజోలికి వెళ్లవద్దని కరీంన గర్ మహిళాతాణా సీఐ పి శ్రీలత అన్నారు. ప్రభుత్వమహిళా డిగ్రీకళాశాలలో ఈరోజు మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలపై అవగాహనసదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీలత మాట్లాడుతూ లుక్సకంటే బుక్స్ గొప్పవని, తనఅనుభవాలను చెబుతూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. విద్యార్థులు మత్తుకు బానిసలుకాకుండా ఉజ్వలభవిష్యత్‌ను తీర్చిదిద్దుకో వాలన్నారు. ఒకసారి మత్తుకు బానిసగా మారితే అతని జీవితంతోపాటు కుటుంబం కూడా చిన్నాభిన్నం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి మాట్లాడుతూ మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల విలువైన జీవితాలను కోల్పోతూ, కుటుంబానికి, సమాజానికితీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారని అన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో మత్తుపదార్థాల నిరోధకకమిటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగిలి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుక్క మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని పెంపుడు కుక్క మృత్యువాత పడింది. కుక్క యజమాని కంకణాల బాలలింగం ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలలింగం ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం

ఇక మీ చేతుల్లో..

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల సమాచారం ఇక మీ చేతిలో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచింది. ఈ పథకంలో ఇటీవల 163 వైద్య చికిత్సలను కొత్తగా చేర్చింది. మొత్తంగా 1,835 చికిత్సలు చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డును ఆమోదించే ఆసుపత్రుల్లో మాత్రమే ఉచిత వైద్య పొందే అవకాశం ఉంటుంది. మీ సమీపంలో ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు ఉన్నాయనే సమాచారం ఇకపై మొబైల్ ఫోన్, కంప్యూటర్‌లలో సులువుగా తెలుసుకోవచ్చు.

● కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లో ముందుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ www.rajivarogyasri. telangana.gov.inలోకి వెళ్లాలి. అనంతరం టాప్ సర్వీస్ బార్‌లో కనిపించే హాస్పిటల్స్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అపుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ అనే దానిపై క్లిక్ చేస్తే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ మూడు ఆప్షన్ల ద్వారా దగ్గర్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను తెలుసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఆప్షన్లపై క్లిక్‌చేస్తే కొత్తపేజీ ఓపెన్ అవుతుంది. మీరు ఎంచుకున్నదాని ప్రకారం సెర్చ్ ఆప్షన్‌లో మీ జిల్లా, మీ మండలం హాస్పిటల్, స్పెషాలిటీ, ప్రభుత్వ లేదా ప్రైవేటుని ఎంపిక చేసుకోవాలి. అనంతరం అందుబాటులో ఉన్న ఆసుపత్రులు కనిపిస్తాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్య మిత్ర సభ్యుల పేర్లు, వారి ఫోను నంబర్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అందించే సేవల వివరాలు చూడవచ్చు.

● ఇంకా ఏమైనా సమాచారం లేదా సందేహం ఉంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రి ఆరోగ్య మిత్ర సభ్యులను సంప్రదించవచ్చు. అక్కడ మీకు కావలసిన వైద్య సేవలు ఉన్నాయో లేవో తెలుసుకొని, సమయం వృథా కాకుండా చూసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రాజు తెలిపారు.

జిల్లాల వారీగా ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలు..

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు కలిపి మొత్తం 52 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, డాక్టర్ భూంరెడ్డి హాస్పిటల్, అమృత నర్సింగ్‌హోం, అపోలోరీచ్, మెడికవర్, సరోజిని హాస్పిటల్, శ్రీరామ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఓమెగా సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్, వెంకటేశ్వర కిడ్నీ సెంటర్, చల్మెడ మెడికల్ కాలేజీ, ప్రతిమ మెడికల్ కాలేజీ, సూర్య నర్సింగ్‌హోం, సన్‌షైన్ హాస్పిటల్, సంజీవని నర్సింగ్‌హోం, అక్షయ మల్టీస్పెషాలిటీ, ఆదర్శ హాస్పిటల్, మురుగన్ హాస్పిటల్, శ్రీకృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, రెనీ హాస్పిటల్, వన్ హాస్పిటల్, సీవీఎం హాస్పిటల్, డాక్టర్ శరత్ మ్యాక్స్‌విజన్ ఐ హాస్పిటల్, రిషిక చిల్డ్రన్స్ హాస్పిటల్ జమ్మికుంట, హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి (ప్రభుత్వ), జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ)

జగిత్యాల జిల్లాలో..

జగిత్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గీతా ఆర్థోపెడిక్, మెటర్నిటీ నర్సింగ్ హోం, అమృత, త్రినేత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సాయి సంజీవని హాస్పిటల్, శివసాయి హాస్పిటల్, పావని ఐ హాస్పిటల్, తిరుమల నర్సింగ్‌హోం, ఓం సాయిరాం మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెట్‌పల్లి (ప్రభుత్వ), ధర్మపురి ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), కోరుట్ల ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), రాయికల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, గంభీరావుపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, వేములవాడ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సిరి హాస్పిటల్, అశ్విని హాస్పిటల్

పెద్దపల్లి జిల్లాలో....

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, మంథని ఏరియా ఆసుపత్రి, పెద్దపల్లి ఏరియా ఆసుపత్రి, సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, విజయ హాస్పిటల్.



రాజన్న హుండీ ఆదాయం
రూ. 1.95 కోట్లు

బంగారం 287 గ్రాములు, వెండి 18.5 కిలోలు

వేములవాడ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత నడుమ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. నగదు రూ కోటి 95 లక్షల 75 వేల 168 లభించగా, 287 గ్రాముల బంగారం, 18.500 కిలోల వెండి లభించింది. అలాగే నాంపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో 6 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ 11 లక్షల 47వేల 510 అదాయం లభించింది. హుండీ లెక్కింపును ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేములవాడలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంజన్న హుండీ ఆదాయం రూ1.09కోట్లు

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,09,13,339నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 55 రోజులకుగాను ఆలయంలోని 12 హుండీలను బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 109 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్,అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండగట్టులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

హుండీల్లోనే బంగారం, వెండి

ఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ఈ సారి వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్ చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. వాటిని మరోసారి జరిపే హుండీల లెక్కింపు సందర్భంగా దేవాదాయ శాఖ జూవెలరీ అధికారుల సమక్షంలో తూకం వేయడానికి గాను సీజ్ చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో లేని విధంగా మళ్లీ హుండీలలోనే సీజ్ చేసి వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రిజర్వేషన్ ఫలాలు

అందరికీ అందించడమే లక్ష్యం..

● బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ● రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటన





సిరిసిల్లలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బృందం, వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఫలాలు బీసీలందరికి అందించడమే లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్, గీతానగర్‌లలో పర్యటించారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునే దిశగా వారితో సమావేశం అయ్యారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో అర్చక, ఇతర ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతున్నామని తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కులం సర్టిఫికెట్‌లలో తమ కులం పేరును వంశీయులుగా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు కోరారు. దొమ్మరి కులం పేరు ఉండడంతో సమాజంలో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ సంస్థలు, విద్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కులం పేరు సమస్యపైనే అధ్యయనం చేయడానికి వచ్చామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్‌రావు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన కులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

వేములవాడ : బీసీ సామాజిక వర్గంలోని వెనుకబడిన కులాలైన పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేస్తున్నదని కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు న్యూ అర్బన్ కాలనీలో వెనుకబడిన సామాజిక వర్గమైన పిచ్చగుంట్ల కులానికి చెందిన పలువురి ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను, జీవనోపాధి కోసం వారు పడుతున్న కష్టాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. కులం పేరును విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడున్న కులాల పేర్లకు ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని ఆయా కులాల నుంచి విజ్ఞప్తులు అందాయని తెలిపారు. సమగ్ర అధ్యయనం అనంతరం వచ్చే నెల రెండో వారంలో జరిగే బీసీ కమిషన్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామ ని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో బిల్లు చట్టరూపం దాల్చాలని రాజరాజేశ్వర స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వచ్చే నెల 3 వరకు
రైల్వే గేటు మూసివేత

కొడిమ్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్-అప్పారావుపేట గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటును మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం నుంచి ఏప్రిల్ 3 వరకు గేట్ మూసివేయ నున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని బుధవారం సంబంధిత గ్రామ పంచాయతీల అధికారులకు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారమందించారు. రైల్వే గేటు మరమ్మతు విషయమై నోటీసు అందినట్లు కొడిమ్యాల తహసీల్దార్ జి.రమేష్, పూడూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కరీంనగర్ నుంచి హుజురాబాద్ వైపు వస్తున్న లారీ గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వపై ఉన్న వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసం కాగా ఎవరికీ ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్ధరించారు.

మార్కెట్ సౌకర్యం లేక

మామిడి రైతుల ఇక్కట్లు

రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



మామిడి తోట

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో మామిడికి మార్కెట్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా మామిడి తోటల విస్తీర్ణం రాయికల్ మండలంలోనే ఉంది. ప్రతియేటా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు మామిడిని రైతులు తరలించి విక్రయిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో రైతులకు రవాణా భారం పడుతోంది. రాయికల్ మండల వ్యాప్తంగా 4300 మంది రైతులు 10,500 ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేస్తున్నారు. మూటపెల్లి, కొత్తపేట, భూపతిపూర్, రామాజీ పేట, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, తాట్లవాయి, అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట గ్రామాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి యేటా రైతులు విక్రయాలకు పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్లడం, అక్కడ రేటు వచ్చేదాకా వేచి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్ తదితర మార్కెట్‌లలో రేటు వచ్చే దాకా రైతులు జగిత్యాల మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో పలువురు రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్ట పోతున్నారు. రాయికల్ మండల కేంద్రంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం ఏర్పాటుతో రవాణా భారం తప్పడంతో పాటు రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల రైతులు కోరుతున్నారు.

రవాణా భారం తప్పుతుంది

రాజేందర్, రైతు, చెర్లకొండాపూర్



మామిడి విక్రయాలకు సుమారు 30 కి.మీ. తీసుకువెళ్లడానికి వాహనాలు సమకూర్చాలంటే సుమారు ఒక్కో వాహనానికి ట్రిప్పుకు రూ.5 వేలు ఖర్చు అదనంగా అవుతుంది. రాయికల్ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా భారం తీరుతుంది.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎలగందుల ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్



జిల్లాలోనే రాయికల్ మండలంలో రైతులు అత్యధికంగా మామిడి పంట సాగు చేస్తున్నారు. రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ప్రయాణ భారం తగ్గుతుంది. మామిడి కొనుగోళ్లకు మండలం కేంద్ర బిందువుగా మారితే రైతులకు ప్రోత్సాహం లభిస్తుంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి.

గుడి లేని దేవుడు

- రాతిపై వెలిసిన ఆదివరాహస్వామి
- ఏటా పెరుగుతూ వరాల స్వామిగా ప్రసిద్ధి
- ఈ నెల 30న ఉగాది సందర్భంగా ఉత్సవాలు



బండల మధ్యనే ఆదివరాహస్వామి వారి ఆలయం

కమాన్‌పూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో వెలసిన ఆదివరాహస్వామి వరాల స్వామిగా భక్తుల కోరికలు నెరవేరుస్తున్నాడు. బండి రాతిపై వెలసిన స్వామివారికి గుడి లేదు. ఆరు బయటనే ఉండి నిత్యం భక్తుల పూజలు అందుకుంటారు. ఏటా స్వామివారి పరిమాణం పెరుగుతున్నట్లు ఇక్కడి భక్తులు చెప్పుకుంటారు. సుమారు 600 సంవత్సరాల క్రితం ఒక మహా రుషి తపస్సును మెచ్చి ప్రత్యక్షమైన శ్రీహరి, ఆ ఋషి కోరిక మేరకు ఆదివరాహస్వామి రూపంలో వెలసి భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నట్లు ప్రతీతి. స్వామి వారి రాతి విగ్రహం, ప్రతిఏటా పెరుగుతూ వస్తుండడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు మాత్రమే ఆది వరాహస్వామి ఆలయాలు ఉండగా, శ్రీవారు కొలువై ఉన్న తిరుమల ప్రాంతంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఉన్న ఈ ఆలయం రెండోదిగా ప్రాచుర్యం పొందింది.





రాతిపై స్వామివారు, ఆలయం ముఖద్వారం

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

స్వామివారిని దర్శించుకోవాలంటే కరీం నగర్ నుంచి గోదావరిఖనికి కమాన్‌పూర్ మీదుగా వెళ్లే ప్రత్యేక బస్సులుంటాయి. కరీంనగర్ నుంచి కమాన్‌పూర్ మీదుగా పెద్దపల్లికి ఆర్టీసీ బస్సులు వె ళ్తాయి. దేవాలయానికి దగ్గరగా ఉన్న రైల్వేస్టేషన్ పెద్దపల్లి. అక్క డి నుంచి ఆర్‌టీసీ బస్సులు, ఆటోల సౌకర్యం కూడా ఉన్నది.

ప్రతి మాసంలో కల్యాణం

భక్తుల కోరిక మేరకు ప్రతి మాసంలో కల్యాణం నిర్వహిం చేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ప్రతి మాసంలో ఆదివరాహ స్వామి కల్యాణం నిర్వహించడం వల్ల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఉగాదితో పాటు, శ్రావణ మాసంలో స్వామివారి జయంత్యోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఈ యేడు ఉగాదికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు.

సీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర స్థాయి కాయకల్ప బృందం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రస్థాయి కాయకల్ప బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. రాష్ట్రస్థాయి బృందం, సిద్దిపేట జిల్లా నంగునూర్‌లోని సీహెచ్‌సీ వైద్య అధికారులు మంజుల, శ్రావణి, శ్వేత, లిఖితలు ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, స్థానిక వైద్యులు అజయ్‌కుమార్, బాబు, రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- కాసం రాజశేఖర్, ఏవో



ఆంధ్రజ్యోతి : రైతులు పండిస్తున్న పంటలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఏవో : రైతు వేదికల్లో సాంకేతికను అందిపుచ్చుకుని ఆధునిక వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో పంటలేమైనా ఎండిపోయాయా?

ఏవో : రాజన్నపేట, దేవునిగుట్టతండా, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలకు సాగునీరందక పగుళ్లు చూపుతున్నాయి. తడుల ద్వారా పంటలు కోలుకుంటున్నాయి. సుమారు 15 ఎకరాల వరకు ఎండిపోయాయి.

ఆంధ్రజ్యోతి : నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ఏమైనా ప్రణాళికలు రూపొందించారా?

ఏవో : మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంటల వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలు తయారుచేస్తాం.

ఆంధ్రజ్యోతి : రుణమాఫీ వర్తించని రైతుల సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏవో : మండలంలోని పలు గ్రామాల్లో రూ.2లక్షలలోపు రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. ఇప్పటి వరకు సుమారు 200 మంది దరఖాస్తులను తీసుకున్నాం. ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపడుతాం.

- ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి)

కేటీఆర్ క్యాంప్ కార్యాలయం ముట్టడి భగ్నం

-వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కేటీఆర్ కృషి చేయాలి - సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమలోని సంక్షోభం గురించి కనీసం అసెంబ్లీ సమావేశంలో చర్చించి పరిష్కారం చేయడానికి ఎమ్మెల్యే కేటీఆర్ ప్రయత్నించలేదంటూ బుధవారం సీపీఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కేటీఆర్ క్యాంప్ కార్యాలయం ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. మూడు రోజుల క్రితం సీపీఐ నాయకులు కేటీఆర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. అప్రమత్తమైన పోలీసులు కేటీఆర్ కార్యాలయం ముట్టడి తరలివెళ్తున్న సీపీఐ నాయ కులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం వదిలిపెట్టారు. సాయంత్రం స్థానిక కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయకుండా ప్రధానంగా తానుచేసిన తప్పుడు విధానాల ఫలితంగా గత సంవత్సరం కాలంగా పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. వారానికి నాలుగు రోజులు సిరిసిల్లలోనే ఉంటానని, ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారం చేయడంలో ముందు ఉంటానని చెప్పి సంవత్సర కాలం అవుతున్నా కేటీఆర్ సిరిసిల్ల ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ఈప్రాంత ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నాడని, ప్రభుత్వ అధికారులు నిబంధనాలకు విరుద్ధంగా ఉన్న టీ స్టాల్‌ను(టేల) తొలగిస్తే దానికి కేటీఆర్ తన పేరు పెట్టుకొని, బొమ్మ వేయించుకొని హోటల్ ప్రారంభోత్సవానికి వచ్చాడని అన్నారు. పేదవారికి ఉపాధి చూపించినందుకు తాము స్వాగతిస్తున్నామని, అదేక్రమంలో పవర్‌లూం పరిశ్రమ సమస్యను పరిష్కరిస్తే కార్మికులు కూడా కేటీఆర్ పేరు రాసుకొని, బొమ్మ పెట్టుకొని పూజిస్తారన్నారు. పవర్‌లూం ప్రధాన సమస్య అయిన విద్యుత్ సమస్య కేటీఆర్ సృష్టించిందేనని ఆరోపించారు. పదేళ్ల పాలనలో 50 శాతం విద్యుత్తుకు సంబంధించిన ఒక్క రూపాయి కూడా సెస్‌కు చెల్లించలేకపోవడంతో రూ. 80కోట్లు ప్రభుత్వం బకాయి పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీపతి రమేష్, స్వామి, రాఘవులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. కల్టీవేటర్ బయట తయారుచేస్తే రూ.30 నుంచి రూ.50 వేలు, రోటవేటర్ కొనాలంటే రూ లక్ష వరకు ఖర్చు అవుతుంది. పురుగుల మందు పిచికారీ యంత్రాల ధర మార్కెట్‌లో రూ.3 వేల నుంచి రూ.పది వేల వరకు ఉన్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా నగం ధరకే పరికరాలు రానుండడంతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

లబ్ధిదారుల ఎంపిక కష్టమే..

వ్యవసాయ అధికారులకు వ్యవసాయ పరికరాలు అందించడం ఎలా ఉన్నా లబ్ధిదారులను ఎంపిక చేయడం కత్తిమీద సాములాగే మారుతుంది. మహిళ రైతు ల నుంచి పోటీ ఉండడమే కాకుండా రాజకీయజోక్యం కూడా పెరుగుతుంది. అధి కార పార్టీ చెందిన వారి ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

కోతకు గురైన రహదారి..

- రాకపోకలకు ఇబ్బందులు - పట్టించుకోని అధికారులు

వీర్నపల్లి, మార్చి26 (ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండలం బంజేరు గ్రామం నుంచి మద్దిమల్ల గ్రామానికి వెళ్లే రహదారి గతేడాది కురిసిన వర్షానికి కోతకు గురైంది. దీంతో మండలం నుంచి మద్దిమల్ల, మద్దిమల్ల తండా, తిమ్మాపూర్, సోమారోపేటకు వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు కూడా చేయకపోవడంతో ప్రమాదంగా తయారయింది. నాలుగు చక్రాల వాహనాలు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లయితే భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన రోడ్డు

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్య అంశాలపై నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని టాస్క్ అండ్ కెరీర్ గైడ్, సెల్ కన్వీనర్ డాక్టర్ జె. శ్రవణ్‌కుమార్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు చేపట్టిన గణిత సామర్థ్యాల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ జె. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గణితంలో మెళకువలను నేర్చుకుంటే పోటీ, ఉద్యోగ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరుస్తారన్నారు. రిసోర్స్ పర్సన్ నిశాంత్‌కుమార్ విద్యార్థులకు సులువైన పద్ధతి, గణిత సమస్యల సాధన తదితర అంశాలపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయలక్ష్మీ, అధ్యాపకులు డాక్టర్ ఆంజనేయులు, ధర్మపురి, అడి విష్ణు, వాణి, డాక్టర్ బిక్షమయ్య, మనోహర్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, మ హేశ్, శైలజ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సేన పేరుతో రియల్ ఎస్టేట్ దందాలు

- బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్

ముస్తాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ సేన పేరుకే రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని ముస్తాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెర్గు అంజాగౌడ్ మాట్లాడుతూ కేటీఆర్ పేరు మీద సైన్యం, సేన, అనే టీంలు లేవని కేటీఆర్ ప్రకటించారన్నారు. అయినా కెకె సేన, ప్రస్తుతం కేటీఆర్ సేన పేరుతో కొందరు రియల్ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత సంపాదన కోసం దందాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతి, బాధ నరేశ్, చిట్నేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, గుండవేని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపిక

రుద్రంగి మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయానికి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన దారిశెట్టి అఖిరనందన్ ఆరో తరగతికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్ డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్‌లు విద్యార్థిని అభినందించారు.

● వేములవాడ రూరల్ : హనుమాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన నగరం గాయత్రి నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుమల జగన్నాథచార్యులు తెలిపారు. మండల విద్యాధికారి లోకిని కిషన్, పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, సతీష్ కిరణ్, సరోజ అరుణ, భవిత చిన్నారిని అభినందించారు.

వీర్నపల్లి పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

వీర్నపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వీర్నపల్లి పాఠశాలను డీఈవో జనార్ధన్‌రావు తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, మండల వనరుల కేంద్రం వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వేసవి దృష్ట్యా తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు.

కొండాపూర్ యువకుడికి నౌకాదళంలో ఉద్యోగం

కోనరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన రైతు గొల్లపెల్లి దేవరాజ్-లతల కుమారుడు వివేకవర్ధన్ భారత నౌకాదళ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ ఉద్యోగ ప్రయత్నంచేసి నౌకాదళంలోఎస్ఎఫ్ఆర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కోనరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ ముస్లింలకు బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కచ్చకాయల మహేష్ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు బుర్ర రమేష్, వంగర భూమేష్, కచ్చకాయల భాస్కర్, మానుక పర్వతాలు, ఎర్రవెల్లి దాసు, ముస్లింలు మాజీ కోఆప్షన్ మెంబర్ యాకూబ్, రియాజ్, గయాజ్, సిద్దిక్, రహీం, ఇంతియాజ్, మున్సబ్, కరీం, మోసిన్ తదితరులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

చందుర్తి, మార్చి 26: (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం పనులపై 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన..



విద్యార్థులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రోజా

వీర్నపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కోఆర్డినేటర్ రోజా అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహితులుగా సోదరభావంతో మెలిగి దేశభక్తి కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, సమస్యలు తెలియజేస్తూ వాటిని ప్రోత్సహించిన వారికి కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, పోక్సో చట్టం, స్వీయ రక్షణపై వివరించారు. యువత మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడడం వల్ల సైబర్ నేరగాళ్ల వలలో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైతే 100, 1098, 1930 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.అశోక్, జనరల్ స్పెషలిస్ట్ దేవిక, ఉపాధ్యాయులు సరిత, ప్రతాప్ కుమార్, రవి, రామస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితులకు ఉపాధి చూపాలి

వేములవాడ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరులో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి చూపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్ డిమాండ్ చేశారు. వేములవాడ అర్బన్ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రం మహేష్ మాట్లాడుతూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇస్తానని హామీచ్చిన రూ.5 లక్షల4 వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంకెపల్లి, ఆరెపల్లి, అనుపురం, రుద్రవరం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణ, చీర్లవంచ గ్రామాల్లోని కొంత మంది అర్హులైన నిర్వాసితులకు పట్టాలు, పరిహారం రాలేదని, వారికి వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, రెడ్డవేని రాజు, జింక శ్రీనివాస్, విశ్వనాథం శ్రీధర్, గుండెకర్ల లక్ష్మణ్, కొమ్మనబోయిన సంతోష్ యాదవ్, బొల్లు తిరుపతి, నాగుల సురేష్, పోచంపల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



ఉత్సవాల్లో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, మనోహర్‌రెడ్డి తదితరులు

చౌడాలమ్మ జాతరలో పాల్గొన్న చల్మెడ

కోనరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యాదవుల ఆరాధ్య దైవమైన చౌడాలమ్మ జాతర ఉత్సవాల్లో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలిసి బుధవారం పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, పాక్స్ వైస్‌చైర్మన్ మహేష్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ కాకరకాయల మంజుల, మమత మహేష్, కచ్చకాయల మహేష్, మాసం సుమన్, వంగాల శ్రీనివాస్, యాదవులు, కే రాజయ్య, మల్లయ్య, ఎల్లయ్య, పరశురాములు, రాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జై బాపు.. జై భీమ్..జై సంవిధాన్ అభియాన్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేకే మహేందర్‌రెడ్డి, కార్యక్రమ ఇన్‌చార్జి జగన్మోహన్ రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ అవేద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నెరవేర్చుతోందని అన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వమని నిరూపించుకుందని అన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ అవేద్ మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పల్లెపల్లెల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజలకు వివరించాలని అన్నారు. రాజ్యాంగాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని అన్నారు. ఆ పార్టీల కుటిల బుద్ధిని ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేయాలని పిలుపునిచారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, రాంరెడ్డి, కిషన్, తిరుపతిరెడ్డి, రాజేందర్, గణేశ్, దేవానందం, లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, రాజునాయక్, లింగాగౌడ్, బుచ్చాగౌడ్, రవి, రఫీక్, నవాబ్, శ్రీనివాస్, రాములు, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్, బీజేపీ విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

వీర్నపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాలను ప్రజలే తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో జైబాబు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలను జిల్లా కోఆర్డినేటర్ హవేద్, మండల ఇన్‌చార్జి లింగారెడ్డితో కలిసి ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ స్ఫూర్తితో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడపగడపకు తీసుకుపోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాల ద్వారా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లబ్ధి పొందుతూ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎవరూ చేయలేని కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, వైస్‌చైర్మన్ లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మొగిలోజు రంగయ్య విద్యుత్ ప్రమాదంతో మృతిచెందగా కుటుంబ సభ్యులకు సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి పరిహారాన్ని అందించారు. మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రంగయ్య విద్యుదాఘాతంతో కొద్దినెలల క్రితం మృతిచెందడం బాధాకరం అన్నారు. సెస్‌సంస్థ పక్షాన రూ.5లక్షలు అందిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు మోటార్లు, పరికరాలు వినియోగించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెస్ ఏఈ నగేష్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పాత బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎంపీడీవో సత్తయ్య బుధవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు, ప్రయాణీకుల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాన్ని నెలకొల్పామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగాప్రభుత్వం క్రమబద్ధీకరణ రుసుంలో మార్చి 31 వరకు 25 శాతం రాయితీ కల్పించిందని, దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో జోగం రాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొనారు. మండలంలోని 2630 మంది దరఖాస్తులు చేసుకున్నారని వారిలో 357 మంది రుసుం చెల్లించారని తెలిపారు. క్రమబద్ధీకరణ చేయని పక్షంలో భవిష్యత్తులో భవన నిర్మాణాల అనుమతి, బ్యాంకుల రుణాలు, క్రయవిక్రయాలకు జరిపేందుకు సమస్యలు తలెత్తనున్నాయన్నారు. దరఖాస్తుదారులు ఈనెల 31లోగా రుసుం చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీవో జోగం రాజు కోరారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

వీర్నపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈజీఎస్ కార్యాలయానికి సమీపంలో ప్రభుత్వ ప్రత్యేక నిధులతో బోరు వేసి మోటార్‌ను బిగించారు. ప్రతిరోజు తాగునీటి సమస్య ఉన్న కాలనీలకు నీటి సరఫరా చేయనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ తెలిపారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని ప్రజలను కోరారు.

చికిత్స పొందుతున్న బాలుడికి పరామర్శ



బాలుడిని పరామర్శిస్తున్న తోట ఆగయ్య తదితరులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇటీవల గడ్డి కోత యంత్రంలో చిక్కుకుని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు నిమ్మంతుల సుదర్శన్‌రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు రమేశ్‌గౌడ్, బాలయ్య, నర్సింలు, సాయిగౌడ్ తదితరులు ఉన్నారు.

'నారాయణ'లో ఫ్యామిలీ బ్లిస్

సిరిసిల్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని నారాయణ పాఠశాలలో బుధవారం ఫ్యామిలీ బ్లిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీమోల్, ఆర్ఐ సత్యంరావు, కో-ఆర్డినేటర్ ప్రవీణ్, అకాడమిక్ డీన్ మహేష్, ఏవో రాజేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ గ్రామానికి చెందిన చెందిన మోటం రేణుకకు రూ 36వేలు, మోటం సరిత రూ 30వేలు, భూక్యా లత రూ 36 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరుకావడంతో బుధవారం వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, నాయకులు బాలకృష్ణయ్య, యాదయ్య, రాజనర్సు, షాదుల్, మోఫిక్, ఉపేందర్, తిరుపతి, జైపాల్, ప్రసాద్, మధు, పరుశరాములు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్ళపల్లి మండలం రామన్నపల్లె గ్రామంలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మందాటి తిరుపతి యాదవ్, ఆత్మకూరు నాగరాజు, మందాటి రమేష్, సంపత్, నక్క రవి, గొర్రె రాజు, గుండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి పాఠశాల విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని నిర్లక్ష్యంగా నడిపిన ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరె అభిషేక్‌కు రూ2వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు ఇచ్చారు.